నత్త నడకన చెత్త తొలగింపు పనులు

- ఆక్రమణల్లో గోస్తనీ కాలువ
- పొలాలకు తప్పని ముంపు
- రైతుల ఆవేదన


పెనుమంట్ర వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, కిక్కిస

పెనుమంట్ర: వేల్పూరు నుంచి మాముడూరు వంతెన వరకు సుమారు 19 కిలో మీటర్ల మేర గోస్తని మురుగు కాలువలో చెత్త తొలగించే పనులు మూడు నెలలగా నత్త నడకన సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నెలలో గోస్తని రైతుల గోడు వినేది ఎవరు శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గోస్తనిలో చెత్త తొలగించేందుకు రూ.1.04 కోట్లు నిధులు మంజూరు చేశారు. చెత్త తొలగింపు పనులను ఇరిగేషన్ ప్రాజెక్టు కమిటీకి అప్పగించారు. జూలై 7న వేల్పూరు వద్ద చెత్త తొలగింపు పనులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఒకే ఒక జేసీబీతో నిర్వహిస్తున్న ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఆక్రమణలు తొలగించాలి

మాముడూరు 18 కిలో మీటర్ల నుంచి వేల్పూరు వద్ద 37 కిలోమీటర్ల వరకు సుమారు 19 కిలో మీటర్ల మేర సాగే చెత్త తొలగింపు పనులు 16 కిలో మీటర్లు ఆచంట నియోజకవర్గం పరిధిలో ఉండగా, మూడు కిలో మీటర్లు తణుకు నియోజకవర్గం పరిధిలో గోస్తని మురుగు కాలువ ఉంది. పెనుమంట్ర మండలం సోమరాజు ఎల్లిందలపర్రు గ్రామం నుంచి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు. చెత్త తొలగింపు పనులను కింద నుంచి మాముడూరు వద్ద 18వ కిలో మీటర్ నుంచి ప్రారంభించాల్సి ఉండగా పైనుంచి వేల్పూరు వద్ద 37వ కిలో మీటర్ నుంచి ప్రారంభించారు. ఇప్పటి వరకు 14 కిలో మీటర్లు సాగిన ఈ పనులకు 90 రోజులు పట్టింది. ఇంకా పెనుమంట్ర నుంచి మావుడూరు వరకు ఐదు కిలో మీటర్ల మేర చెత్తను తొలగించాల్సి ఉంది. ఐతే, ముందు తీసిన ప్రాంతంలో కిక్కిస మళ్లీ చిగురిస్తోంది. అనేక చోట్ల స్థానికులు వేస్తున్న పశువుల పెంట, గ్రామ పంచాయతీల్లోని చెత్త గోస్తనిలో దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోస్తని ప్రాంతంలోని ముంపు బారి నుంచి తప్పించుకునే అవకాశం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. గోస్తని వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించి గోస్తనికి పూర్వవైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.


రజకపేట వంతెన వద్ద సోమవారం పంటును రోడ్డెక్కించిన దృశ్యం


జుత్తిగ - మల్లిపూడి ఫుట్‌పాత్ వంతెన వద్ద ఉన్న ఫ్యాక్టరీ చెత్త


సోమరాజు ఇల్లిందలపర్రు వద్ద గోస్తనిలో చిగురిస్తున్న కిక్కిస

గోదావరికి పంచ హారతులు

పెనుగొండ: వాల్మీకి మహర్షి జయంతి, అశ్వయుజ పూర్ణిమ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో గోదావరికి వేద పండితుడు కలగ భద్రుడు స్వామి అర్చకత్వంలో పంచహారతులు ఇచ్చారు.

ప్రజా వేదికకు ఐదు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు సోమవారం ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ బాబూరావు చెప్పారు. గుమ్ములూరులో 2.39 ఎకరాల విస్తీర్ణం గల చేపల చెరువు రీ సర్వేలో విస్తీర్ణం తగ్గడం వల్ల మళ్లీ సర్వేచేయాలని సన్నిధి సత్యవతి కోరారు. ఇంటి నివేశన స్థలం, తాళ్లకోడులో నిర్మించుకున్న భవనంలో తనకు స్థానం లేకుండా తన భర్త కొట్టి ఇంటి నుంచి నెట్టివేశారని మేకా సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారని చెప్పారు. మాదివాడలో పుంత రోడ్డు ఆక్రమణలపై సర్వే చేయించాలని, పరిమితికి మించి స్థలాని రిజిస్ట్రేషన్ చేయించుకుని, నా స్థలాన్ని ఆక్రమించిన స్థలంను సర్వే చేయించాలని స్థానికులు ఎండీ.నిజాముద్దీన్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం


పెనుమంచిలి గ్రామ కమిటీ అధ్యక్షుడిని అభినందిస్తున్న నాయకులు

పెనుగొండ: వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుంకర సీతారామ్ పేర్కొన్నారు. సోమవారం ఆచంట మండలం పెనుమంచిలిలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆదేశాల మేరకు పార్టీ పెనుమంచిలి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గణేషుల సుబ్బారావును నియమించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల తరుపున ప్రతిపక్ష పార్టీగా పని చేయాలన్నారు. 18 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కుంటోందని తెలిపారు. కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరు ఇబ్బంది పడినా నేరుగా డిజిటల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. యువజన విభాగ అధ్యక్షుడిగా నక్కా మహేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పంది రాజ్యలక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడిగా నార్గన ఆంజనేయులు, బీసీ సెల్ అధ్యక్షుడిగా చిట్టూరి దుర్గా ప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొంబోత్తుల రత్నరాజు, 20 మందితో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ చిటికెన మంగారావు, గంటి బాబురావు, కీర్తి తాతాజీ, అన్నమనీడి వెంకటేశ్వరరావు, కొంబోత్తుల దుర్గా ప్రసాద్, నిమ్మకాయల గంగారాజు, ప్రవా సత్యనారాయణ, రొక్కల జనార్దన్, పుచ్చకాయల భీమారావు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత తెరుచుకున్న లాకర్లు


లాకర్ గదిని తెరుస్తున్న సొసైటీ అధికారులు

పెనుమంట్ర: స్థానిక వ్యవసాయ సహకార సొసైటీ భవనంలో పదేళ్ల క్రితం మూతబడిన సేఫ్ లాకర్ రూమ్ ఎట్టకేలకు రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో సహకార శాఖ అధికారులు సోమవారం తెరిచారు. సొసైటీ కార్యదర్శి కె.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం పదేళ్ల క్రితం సొసైటీ అప్పటి కార్యదర్శి అవినీతి ఆరోపణలలో సస్పెండ్ అయ్యారని, నాటి నుంచి లాకర్ రూమ్ తాళాలు సొసైటీకి స్వాధీనం చేయలేదని చెప్పారు. అయితే సొసైటీకి త్రిసభ్య కమిటీ ఏర్పడిన అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా గత కార్యదర్శి లాకర్ రూమ్ తాళాలను సొసైటీకి అప్పగించారు. అధికారులు పంచనామ నిర్వహించి లాకర్ రూంను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ లోన్స్ ప్రాజెక్ట్ ఉపయోగపడే విధంగా లాకర్లను వినియోగిస్తామని త్రి సభ్య కమిటీ చైర్మన్ జవ్వాది సురేష్, సభ్యులు సత్తి సత్యానంద రెడ్డి, పి.విజయ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎలియామ్మ, మండల కోపరేట్ అధికారి ఎంఎం రెహమాన్, సొసైటీ ప్రత్యేక అధికారి పసుపులేటి రాంబాబు పోలీస్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి వీఆర్‌ఏల నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సుబ్బారావు

నరసాపురం: వీఆర్‌ఏల సమస్యలపై ఈనెల 13, 14, 15 తేదీల్లో విజయవాడ అలంకార్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు తెలిపారు. వీఆర్‌ఏల సంఘం నరసాపురం మండలం కమిటీ సమావేశం సోమవారం నరసాపురంలో రావూరి మాణిక్యాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు లేదా అలంకార్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని చేసిన వాగ్దానాలు గాని అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో వీఆర్‌ఏలు అదనపు పని భారం కూడా మోస్తున్నారని తెలిపారు. తప్పని పరిస్థితుల్లో నిరసనకు నిర్ణయించుకున్నట్టు చెప్పారు. నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్రమోషన్లు అమలు చేయాలని తదితర డిమాండ్లతో 13, 14 తేదీల్లో దీక్షలు 15న ధర్నా చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం ఆంజనేయులు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ


నిత్యావసర సరకులు అందిస్తున్న జయసరిత

పాలకొల్లు సెంట్రల్: ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. సోమవారం పోడూరు మండలం రావిపాడు గ్రామంలో ఓ కుటుంబానికి బియ్యం బస్తాతో పాటు నిత్యావసర సరకులను ఆమె అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవ రాజేష్, వడ్డి సంజీవ్‌కుమార్, జల్లి మురళీకృష్ణ, బద్ద శరత్ కుమార్, వాసా జయచంద్రశేఖర్, నల్లి ప్రసాద్, విప్పర్తి ధర్మారావు, నల్లి నాగరాజు, ఇంజేటి వరప్రసాద్, రాపాక శివకుమార్, రామానుజుల చిన్నమదు, కుసుమ ఝాన్సీ, హేమలత, పసుపులేటి కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దోషులను అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న గంటా సుందర కుమార్

నరసాపురం రూరల్: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలోని ఐక్యవేదిక ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడం కుల దురహంకారం చేయడమేనన్నాయన అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దారుణం అన్నారు. సమావేశంలో పెట్టా రామారావు, ఎం సోమయ్య, కాటన్ చంటి, తాతారావు, చవ్వాకుల నాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి ముగింపు వేడుక


సూర్యనారాయణరాజును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నరసాపురం: వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం సోమవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ముఖ్యఅతిథి మలిఖిపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ విభాగం కో ఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ నేటి సమాజానికి గాంధీ సిద్ధాంతాలు అవసరమన్నారు. వైఎన్ కళాశాల గాంధీ అధ్యయకేంద్రం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటీ అండ్ కరస్పాండెంట్ అందే రామసతీష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుదే భవిష్యత్


ప్రముఖ సాఫ్ట్‌వేర్ ట్రెయినర్ మురళీ కృష్ణ

ఆకివీడు: ఆధునిక సాంకేతిక విప్లవంతో ప్రపంచం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోందని ప్రముఖ సాఫ్ట్‌వేర్ ట్రెయినర్ కె.మురళీ కృష్ణ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షత వహించారు. మురళీ కృష్ణ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు కంప్యూటర్ విప్లవంలో, భవిషత్ సాంకేతిక రంగంలో దూసుకుపోనుందన్నారు. విద్యుర్థులు మెరుగైన భవిష్యత్ పొందడానికి ఏఐ సాంకేతిక పరిజ్ఞానంపై విద్యాభ్యాసనాన్ని కొనసాగించాలన్నారు. అవగాహనతో పాటు, విజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్‌లో మంచి అవకాశాలు పొందవచ్చునన్నారు. ఏఐ పరిజ్ఞానం, పరికరాలు, రెజ్యూమ్ తయారీ, కంటెంట్ తయారీ, పీపీటీ తయారీలో చాట్‌జీప్ట్, పర్‌ప్లెక్సిటీ వంటి సాధనాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఏఐ కీలక మార్పుల్ని తీసుకువస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడం స్ఫూర్తిదాయకం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న బుషీల్

పాలకొల్లు సెంట్రల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో లయన్స్ సేవలు ఎనలేనివని నేజీరియా నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ డైరెక్టర్ నడినే బుషీల్ అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలో బుషీల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్‌లను పరిశీలించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎల్‌సీఐఎఫ్ ఫండ్‌కు రూ.50 వేలు బుషీల్‌కు అందించారు. రూ.లక్ష విలువ చేసే హోమియోపతి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. తొలుత పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. క్లబ్ జిల్లా గవర్నర్ నిమ్మల పాపారావు నాయుడు, పట్టణ అధ్యక్షులు శిడగం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: ఏలూరులో జరిగిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ (టెస్ట్) కరాటే పోటీల్లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటి బ్లాక్ బెల్టులు సాధించారని జపాన్ షోటోఖాన్ కరాటే కనంజుకు అర్గనైజేషన్ ఇన్‌స్ట్రక్టర్ ధనాని సూర్యప్రకాష్ సోమవారం తెలిపారు. ఆదివారం ఈ పోటీలు జరిగాయని ఆయన వెల్లడించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా


ఈరంకి కాశి

పాలకొల్లు సెంట్రల్: తనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమించడంపై పట్టణానికి చెందిన ఈరంకి కాశీ విశ్వనాథం సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సోమవారం పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన నాయకులు


మిథున్‌రెడ్డిని కలిసిన గోపి, వెంకట్రాయుడు తదితరులు

పాలకొల్లు సెంట్రల్: ఇటీవల అక్రమ కేసులో అరెస్టైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు, భీమవరం నియోజకవర్గాల ఇన్‌చార్జీలు గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి), చినిమిల్లి వెంకట్రాయుడు సోమవారం తాడేపల్లిలో మిథున్‌రెడ్డి నివాసంలో కలిశారు. నియోజకవర్గాల్లోని పార్టీ విషయాలపై చర్చించారు. మిథున్‌రెడ్డిని కలిసిన వారిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మేధావుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఈధ జాషువా, పాలపర్తి కృపానాథ్‌లు ఉన్నారు.

తాడేరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

భీమవరం అర్బన్: తాడేరు విశాల సహకార పరపతి సంఘం త్రి సభ్య కమిటీ సోమవారం మండలంలోని కరుకువాడ బేతపూడిలోని ప్రైవేట్ కన్వెన్సన్ హాల్‌లో ప్రమాణ స్వీకారం సోమవారం చేశారు. చైర్మన్‌గా కొట్టు సురేష్, డైరెక్టర్లుగా జవ్వాది వెంకటేశ్వరావు, కొత్తపల్లి ధైర్య తేజలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్య సభ సభ్యుడు పాకా సత్యనారాయణ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లఘు కల్యాణం

కాళ్ల: వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్లకు ఆశ్వయుజ మాస చిన్న కల్యాణ(లఘు కళ్యాణం) మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ వైష్ణవ ఆగమానుసారం స్వామి వారి కల్యాణ మండపం నందు భీమవరానికి చెందిన మరంగంటి ఝాన్సీ లక్ష్మి వారి కుమారులచే స్వామివారికి అర్చకులు వేద పండితులచే వేదమంత్రాలు నడుమ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారి కల్యాణ మహోత్సవం తిలకించారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. బలరామరాజు తన సిబ్బందితో కొమరాడలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కోడి సోమకుమార్‌పై దాడి చేసి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఎస్సైలు పీవీఎస్ ఉమా మహేశ్వరరావు, పి. సునీల్ కుమార్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

9,10 తేదీలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ఉండి: ఈ నెల 9, 10 తేదీల్లో మండలంలోని అందరు సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సీవీఎస్ రెడ్డి పత్రికా ప్రకటనలో సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీలకు మొత్తం 22 మంది గ్రేడ్ -, గ్రేడ్-4 కార్యదర్శులు మొత్తం మీద 44 మంది ఉన్నారని తెలిపారు. కాబట్టి అందరూ ప్రజాప్రతినిధులు, అధికారులు రెండురోజులు తప్పనిసరిగా నూటికి నూరుశాతం హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో తెలిపారు.

'గ్రంథాలయ సంస్థ అలసత్వం లేదు'

నరసాపురం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో కొత్తగా నిర్మించతలపెట్టిన గ్రంథాలయ భవనం పనులు నిలిచిపోవడంలో గ్రంథాలయ అభివృద్ధి సంస్థ అలసత్వంలేదని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు వివరణ ఇచ్చారు. నిలిచిన గ్రంథాలయ పనులు శీర్షికన గత నెల 15వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పనులు ఏపీఈడబ్ల్యూఐడీసీ వారికి అప్పగించి రెండు విడతలుగా వారికి సొమ్ములు చెల్లించామని పేర్కొన్నారు. రూ.1.28 కోట్లు అంచనాతో మొదలైన పనులకు గ్రంథాలయ అభివృద్ధి సంస్థ డబ్బులు ఇచ్చిందని, వారు పనులు చేసి అప్పగించాలని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

పాలకొల్లు సెంట్రల్: పౌర్ణమి కావడంతో సోమవారం స్థానిక పంచారామక్షేత్రం క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకు పూజలు చేశారు. 20 మంది దంపతులు హోమంలో, సాయంత్రం ప్రదోషకాలంలో భక్తులు సప్తసోమవార ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు, ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో డివిజన్‌లోని పలు మండలాల నుంచి మొత్తం 37 ఫిర్యాదులు అందాయని ఆర్డీఓ దాసిరాజు తెలిపారు. ప్రజల నుంచి ఆయన సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను ఏ మేరకు పరిష్కరించారో తనకు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

యలమంచిలి: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతాబ్ది ఉత్సవం స్థానిక తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యవక్త, సహ శారీరక ప్రముఖ్ ఓలేటి రవి సంఘ ప్రాముఖ్యతను, విధానాలను వివరించారు. ఎంపీపీ వినుకొండ ధనలక్ష్మీ రవికుమార్, తాళ్లూరి శ్రీనివాసు (వైజాగ్ బుజ్జి), ఉప మండల ప్రముఖ్ మన్నే కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుందుర్రు శివారులో కోడిపందేల శిబిరంపై దాడిచేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ ఎస్సై టీవీ సురేష్ తెలిపారు. నిందితుల నుంచి రూ.23,260 నగదు, 10 మోటార్ సైకిళ్లు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

విధులను అడ్డుకున్న వ్యక్తులపై కేసు

యలమంచిలి: బాడవ గ్రామానికి చెందిన ఇంటి వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఉమా మహేశ్వరరావు అన్నదమ్ములు. వీరికి ఉమ్మడి కొబ్బరితోట ఉంది. కొబ్బరి దింపు విషయంలో తగాదా రావడంతో ఉమా మహేశ్వరరావు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఎస్సై కె.గుర్రయ్య హోం గార్డులు చవ్వాకుల నాగేశ్వరరావు, ఉదయ భాస్కరరావులను రక్షణగా బాడవ పంపారు. ఉమామహేశ్వరరావు దింపు తీయిస్తుండగా వెంకటేశ్వరరావు, రామకృష్ణ, వీళ్ల బావమరిది నాగబాబు వచ్చి అడ్డుకున్నారు. హోం గార్డు నాగేశ్వరరావుపై దాడికి దిగారు. హోంగార్డు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గుర్రయ్య కేసు నమోదు చేశారు.

ఉండిలో రీసర్వేపై గ్రామ సభ

ఉండి: మండలంలోని ఉండి గ్రామ సచివాలయం వద్ద సోమవారం రీసర్వేపై రైతులతో అధికారులు గ్రామ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో రైతులు రీసర్వేలో ఏవైనా తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వాటిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.